నాగన్న గెడ్డకు మోక్షం



అధ్వానంగా నాగన్న గెడ్డ



ఆధునికీకరించిన నాగన్న గెడ్డ

- అధ్వాన స్థితి నుంచి ఆధునికీకరణ
- రక్షణ గోడల నిర్మాణం
- ముంపు సమస్యకు పరిష్కారంపై నివాసుల హర్షం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డులోని పలు ప్రాంతాల నుంచి ప్రవహిస్తున్న నాగన్న గెడ్డకు మోక్షం లభిస్తుంది. ఎట్టకేలకు దీనిని ఆధునికీకరించారు. నాడు ఈ గెడ్డ ప్రమాదకర స్థితిలో ఉండేది. ఒకపక్క గెడ్డలో పూడికలు పేరుకుపోయి, పెద్ద పెద్ద చెట్లు మొలిచి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారితే.. మరోవైపు కనకారావు వీధి, హరగోపాల్ స్కూల్ ఎదురుగా గల ప్రాంతంలో రక్షణ గోడ కూలి గెడ్డలో ప్రవహిస్తున్న మురుగు నీరు ఇళ్లలోకి ప్రవహించేది. ఇక వర్షాలు పడితే పరిస్థితి వర్ణనాతీతం. ఇళ్లన్నీ గెడ్డ నీటిలోనే మునిగిపోయేవి.

వేగవంతంగా పనులు

20 ఏళ్లగా ఇదే పరిస్థితి. ఎంతమందికి విన్నవించుకున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ అభ్యర్థిగా గెలుపొందిన ఆళ్ల లీలావతి శ్రీనివాస్‌కు స్థానికులు ఈ సమస్యను తెలియజేశారు. వెంటనే ఆమె నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త కె.కె.రాజు, నాటి జీవీఎంసీ కమిషనర్‌ల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ గెడ్డ ఆధునికీకరణ పనులను ఉంచి వెంటనే కాంట్రాక్టు మంజూరు చేయించారు. వెంటనే పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ అనుకున్న సమయంలో గెడ్డ రక్షణ గోడల నిర్మాణం, ఇతర పనులు పూర్తి చేశారు. సుమారు రూ.39 లక్షల జీవీఎంసీ నిధులతో నాగన్న గెడ్డను ఆధునికీకరించారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కరించారు

వర్షాలు పడితే కంటి మీద కునుకు లేకుండా గడిపేవాళ్లం. ఏ సమయంలో మా ఇళ్లు మునిగిపోతాయో తెలియని పరిస్థితి. కొన్నిసార్లు ఈ పక్కనే గల అపార్ట్‌మెంట్లలో తల దాచుకునేవాళ్లం. గెడ్డ గురించి కార్పొరేటర్ ఆళ్ల లీలావతి దృష్టికి తీసుకెళ్లగానే.. వెంటనే ఆమె సమస్యను పరిష్కరించి స్థానికులకు మేలు చేశారు.

– వానపల్లి వెంకట అప్పారావు, స్థానికుడు

కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు

సుమారు 25 ఏళ్లగా కనకారావు వీధిలో నివసిస్తున్నాం. నాగన్న గెడ్డ తరచూ పొంగడంతో మురుగు ఇళ్లలోకి వచ్చేది. రక్షణ గోడ కూలిపోవడంతో ఈ సమస్య మరింత ఎక్కువైంది. కార్పొరేటర్‌గా ఆళ్ల లీలావతి శ్రీనివాస్ గెలుపొందిన వెంటనే ఈ సమస్యను పరిష్కరించారు. ఆమెకు మా అందరి కృతజ్ఞతలు.

– కంచు రమణమూర్తి, కనకారావు వీధి

అధికారులు, నాయకుల సహకారం



నాగన్న గెడ్డ గురించి స్థానికులు తెలియజేసిన వెంటనే నేను ఆ ప్రాంతానికి వెళ్లి పత్యక్షంగా పరిస్థితిని చూశాను. ఇది చాలా ఏళ్లగా ఉన్న సమస్య. అధికారులు, నాయకుల సహాయ సహకారాలతో వెంటనే సమస్యను పరిష్కరించాం. మా వార్డులోని ప్రధాన సమస్యల్లో దీనిని చేర్చి పనులు పూర్తి చేయించాను.

– ఆళ్ల లీలావతి శ్రీనివాస్, కార్పొరేటర్, 42వ వార్డు

క్లుప్తంగా

గురుపౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా

సీతమ్మధార: నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో జూలై 3న గురుపౌర్ణమి మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు రాజా స్వామి తెలిపారు. ఆరోజు ఉదయం 7 గంటలకు సుదర్శన హోమం, 8.30 గంటలకు బాబాకు ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం 4 గంటలకు అన్నాభిషేకం జరుగుతాయన్నారు. సుదర్శన హోమంలో పాల్గొనే భక్తులు రూ.516, అన్నాభిషేకానికి రూ.200 రుసుం చెల్లించి రసీదు పొందాలని కోరారు. గురువారం సందర్భంగా షిర్డీసాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోషకాహారం అందజేత



చిన్నారి తల్లికి పాలు, గుడ్లు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్ గౌరి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం రెండో విడత కిట్లు అందజేశారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల వయసు చిన్నారులకు 12 గుడ్లు, లీటర్ పాలు ప్యాకెట్లు అంగన్‌వాడీ టీచర్ గౌరి అందించారు. గర్భిణులకు ప్రతి రోజూ గుడ్డుతోపాటు భోజనం అందజేస్తున్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ విజయలక్ష్మి, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ సీతంపేట, 11 కేవీ ఏపీఎస్ఈబీ ఫీడర్ల మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సీతంపేట వినాయక గుడి, కృష్ణుడి గుడి, మార్గదర్శి ఆఫీస్ ఏరియా, సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్, కొండ ప్రాంతం, ఆర్ అండ్ బీ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని 104 ఏరియా, బాపూజీనగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఐటీఐ కూడలి, సిద్ధార్థనగర్, 104 ఏరియా, శ్యామ్‌నగర్ కాలనీ, బాపూజీనగర్, భవానీ గార్డెన్స్, గణేష్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం సుభాష్‌నగర్ దరి రైల్వే డీజిల్ లోకోషెడ్ వద్ద గురువారం గుర్తు తెలియని ఒక వ్యక్తి చెట్టుకు ఉరిపోసుకుని చనిపోయి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుంది. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మత్తు పదార్థాల నియంత్రణపై స్పెషల్ డ్రైవ్



విశాఖ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం విశాఖ రైల్వేస్టేషన్‌లో గవర్నమెంట్ రైల్వే పోలీసులు గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ రాహుల్‌దేవ్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ బి.మోహనరావుల ఆదేశాల ప్రకారం రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫాంలపై ఈ కార్యక్రమం చేపట్టారు. మత్తుపదార్థాలు కుటుంబాలను ఎలా చిన్నాభిన్నం చేస్తాయో, వాటి వినియోగం, రవాణా చేయడం వల్ల ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందో జీఆర్పీ సిబ్బంది ప్రయాణికులకు వివరించారు. ఇటువంటి వాటికి అలవాటు పడితే కలిగే అనర్థాలను తెలిపేందుకు అవగాహన కల్పించి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు కలిగి ఉండటం, రవాణా చేయడం కూడా నేరమని, ఇటువంటి నేరాలకు పాల్పడిన వారిని కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఆర్పీ సీఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌లకు అభినందనలు

సీతమ్మధార: విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుమారుడు, భార్య, ఆడిటర్ జీవీ కిడ్నాప్ కేసులో నగర పోలీస్‌లకు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు అభినందనలు తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే నగర పోలీస్ కమిషనర్ స్పందించి కిడ్నాపర్‌లను అరెస్ట్ చేయడంలో సీపీతోపాటు ఇతర పోలీస్ అధికారుల పనితీరు ప్రశంసనీయమన్నారు.

ముగిసిన కనకమాంబ పండగ



డ్యాన్స్‌తో అలరిస్తున్న చిన్నారులు

సీతంపేట: సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి పండగ మహోత్సవం గురువారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక రాధాకృష్ణ మందిరం వద్ద ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ సంపంగి శ్రీనివాసరావు, కనకమ్మ చికెన్ సెంటర్ యజమాని భీమవరపు శ్రీనివాసరావుల ఆర్థిక సాయంతో నిర్వహించిన డ్యాన్స్ బేబీ షోలో పలు హిట్ సాంగ్స్‌కు చిన్నారులు చేసిన డ్యాన్స్‌లు అలరించాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్, శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ధ్యాన మందిరంలో వైద్య శిబిరం



భక్తులకు వైద్య పరీక్షలు చేస్తున్న హాస్పిటల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఉదయం బాబాకు ప్రత్యేక పూజలు, మధ్యాహ్న హారతి అనంతరం భక్తులకు, పేదలకు అన్నదానం చేశారు. ధ్యాన మందిర ప్రాంగణంలో ఓమ్ని ఆర్కే హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయ సిబ్బందితోపాటు సుమారు 106 మంది వైద్య సేవలు పొందారు. చిన్నారులు, పెద్దలకు పలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి ఆరోగ్య సంరక్షణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు, హాస్పటల్ సిబ్బంది గౌరునాయుడు, చంటి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువు జగనన్న బాధ్యత



ఉర్దూ యూపీ స్కూల్‌లో విద్యార్థులకు జేవీకే కిట్లు అందిస్తున్న ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు



జగన్నాథపురం స్కూల్‌లో జేవీకే కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి



వెంకటేశ్వర కాలనీ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థికి కిట్టు అందజేస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ



జగనన్న విద్యా కానుకలతో ఎన్ఎంసీహెచ్ స్కూల్ విద్యార్థులు

సీతంపేట: పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదని ఆ బాధ్యత అంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు అన్నారు. ముస్లిం తాటిచెట్లపాలెంలోని జీవీఎంసీ ఉర్దూ యూపీ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు–నేడు పేరిట ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారని, అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేలు జమ చేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులపై ఒక్క రూపాయి భారం పడకుండా జగన్ మామ చదివిస్తున్నారని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శాంతికుమారి, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యా కానుకలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

43వ వార్డు వెంకటేశ్వర కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ జగనన్న విద్యా కానుక కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుల భారమంతా తన భుజాలకు ఎత్తుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగో ఏడాది విద్యా కానుకలు అందజేశారన్నారు. నాణ్యమైన మూడు జతల యూనిఫారాలు, షూ, టై, బెల్టు, బ్యాగు, పుస్తకాలు అందజేసి కార్పొరేట్ స్కూల్ విద్యార్థులకు తామేమి తక్కువ కాదని ఆత్మవిశ్వాసం నింపారన్నారు. నాడు–నేడు కింద రూ.16 లక్షలతో పాఠశాలలో ఫ్లోరింగ్, టాయిలెట్లు, విద్యుత్ లైటింగ్ వంటి సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు ఉషశ్రీ సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.వి.దొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేవీకే కిట్ల పంపిణీ

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు గురువారం జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. వాటిని అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యా కానుక బ్యాగు వీపున తగిలించుకొని, పుస్తకాలు చేతిలో పట్టుకొని సంతోషంగా ఇంటి బాట పట్టారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్‌ఎం రాంప్రసాద్ మాట్లాడుతూ 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్స్, షూస్, యూనిఫారంతో కూడిన కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

42వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు జగన్నాథపురంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎంతో కలిసి కార్పొరేటర్ ఆళ్ల లీలావతి జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాస్, స్కూల్ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పైడి రమణకు సత్కారం



పైడి రమణను సత్కరించి అభినందిస్తున్న పార్టీ నాయకులు

తాటిచెట్లపాలెం: ఇటీవల ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణకు స్థానిక వార్డు నాయకులు, పలు యూనియన్ల ప్రతినిధులు, కాలనీ నాయకులు అభినందనలు తెలిపారు. గురువారం తన నివాసంలో పైడి రమణను పార్టీ నాయకులు హరిపట్నాయక్, నేపాల్ శ్రీను, నాయుడు, దుర్గా, నాగరాజు, పైడి భీమా, శ్రీను, గణపతి, రాంబాబులతో పాటు సాయి గణేష్ ఆటో స్టాండ్ సభ్యులు, పలిశెట్టి ఆదినారాయణ, జగడం రమణ, పడాల శంకర్, కొప్పిశెట్టి లక్ష్మణరావు, కొప్పిశెట్టి రమణ, సిమ్మారావు, తదితరులు కలిసి సత్కరించారు.

అంగన్‌వాడీ విద్యతో పిల్లల్లో మానసిక వికాసం



మాట్లాడుతున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అన్నారు. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో గురువారం జరిగిన జన్ భాగిదరి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రానికి పంపించడం వల్ల ఆటపాటలు, కథలు, పోషకాహారంతో పిల్లల శారీరక, మానసిక వికాసానికి బాటలు వేస్తారన్నారు. చిన్నారులకు యాక్టివిటీ బుక్స్, వర్క్‌బుక్స్, మధ్యాహ్న భోజనం, ఉడికించిన కోడిగుడ్లు, పాలు ఇస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ విద్యకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ అవకాశాలను ప్రతి తల్లి సద్వినియోగం చేసుకునేలా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీవో దుర్గాప్రసాద్, మధురానగర్ హైస్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఇందిర, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా పోలీసులు, ఆయాలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ



కాలేజీ ప్రాంగణంలో మొక్క నాటుతున్న డాక్టర్ రావ్, ప్రొఫెసర్ సాంబశివరావు

మురళీనగర్: మొక్కలను సంరక్షించినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ వీఎం రావ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా ఐఎస్‌టీడీ వైజాగ్ చాప్టర్, కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా గురువారం నిర్వహించిన మొక్కల పెంపకం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. విద్యార్థులు నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాల్లో మొక్కల పెంపకం, వాటి సంరక్షణ బాధ్యతను ప్రధాన అంశంగా తీసుకోవాలని సూచించారు. ఒక చెట్టును నరికితే దాని స్థానంలో మరో చెట్టుతోపాటు పది మొక్కలు నాటాలన్నారు. ప్రొఫెసర్ ఎస్.సాంబశివ రావు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ నియంత్రణకు పచ్చదనం పరిరక్షణ ప్రధానమని వివరించారు. ప్లాస్టిక్ వస్తువుల వాడకం తగ్గించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ రావ్, ప్రొఫెసర్ ఎస్.సాంబశివరావు కాలేజీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై విస్తృత ప్రచారం



మహిళలు, విద్యార్థినులకు దిశ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ద్వారకా పోలీసులు

సీతమ్మధార: మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దిశ యాప్‌పై పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధి శ్రీనగర్‌లో గురువారం మహిళలు, విద్యార్థినులు, యువతీ యువకులకు అవగాహన కల్పించి వారి సెల్‌ఫోన్‌ల్లో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు ఆదేశాల మేరకు ద్వారకా మహిళ పోలీసులతోపాటు కానిస్టేబుళ్లు శ్రీనగర్, రామాటాకీస్, సత్యం జంక్షన్, గురుద్వారా ప్రాంతాల్లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి రిజిస్టర్ చేయించారు. వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. ఆపద సమయంలో పోలీస్ వారి తక్షణ సహాయం దిశ ఎస్‌వోఎస్ బటన్ ప్రెస్ చేసిన వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం వెళుతుందన్నారు. బటన్ ప్రెస్ చేయలేని స్థితిలో ఉంటే, ఫోన్ గట్టిగా అటూ ఇటూ ఊపినా పోలీసులకు సందేశం చేరుతుందని వివరించారు. పోలీసులు వెంటనే అక్కడికి వచ్చి సహాయం అందిస్తారని చెప్పారు.

ఆక్రమణల తొలగింపు



బడ్డీలు తొలగిస్తున్న సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24 వార్డుల పరిధిలోని పలు ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల ఆదేశాల మేరకు గురువారం తొలగింపు కార్యక్రమం చేపట్టారు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో ఉన్న బడ్డీలను ట్రాఫిక్ ఎస్ఐ రామూర్తి పర్యవేక్షణలో పొక్లెయిన్‌తో తొలగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు పక్కన బడ్డీకొట్లు, షాపులు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతోందన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

పాఠశాలల అభివృద్ధికి ముందుకు రండి



మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రసాద్

మర్రిపాలెం: మున్సిపల్ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పిలుపునిచ్చారు. వార్డులోని మాధవధార ప్రాథమిక పాఠశాలలో దాతల నిధులతో అందించిన డిజిటల్ మైక్‌సెట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే పాఠశాలలను నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చేస్తోందన్నారు. మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మైక్‌సెట్ అందించిన పోర్టు పూర్వ ఉద్యోగి మాచిరాజు నారాయణరావుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నారాయణరావు, సూర్యకుమారి దంపతులను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.హేమలత, ఉపాధ్యాయులు పైడి కృష్ణారావు, అన్నపు సన్యాసినాయుడు, పొన్నాడ అప్పారావు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఆర్‌ఎం దృష్టికి రైల్వే సమస్యలు



డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతిని కలిసిన మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

తాటిచెట్లపాలెం: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత పి.విష్ణుకుమార్‌రాజు గురువారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతిని కలిశారు. ఈ సందర్భంగా పలు రైల్వే సమస్యలు, రైల్వే వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను డీఆర్‌ఎంకు వివరించారు. మర్రిపాలెం రైల్వే కాలనీ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు తొలగించాలని కోరగా.. డీఆర్‌ఎం రైల్వే కాలనీల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇటువంటి బారికేడ్ల వల్ల అసాంఘిక శక్తులు కాలనీలోనికి చొరబడకుండా అరికట్టవచ్చని, కాలనీల వాసులకు రక్షణ కల్పించేందుకు ఈ బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రైల్వే కాలనీలో నివసిస్తున్న ఉద్యోగుల కుటుంబాలు చేసిన ఫిర్యాదుల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైల్వే కాలనీలో పార్కులు, చెట్ల పెంపకం, పిల్లల ఆట స్థలాలు, వాకర్స్ ట్రాక్‌లు రైల్వే ఉద్యోగుల, వారి కుటుంబాల కోసం ఏర్పాటు చేస్తున్నట్లు డీఆర్‌ఎం సత్పతి చెప్పారు. మిగిలిన విషయాల్లో పరిశీలించి తగు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సమాజ ఉపయుక్తంగా పరిశోధనలు

ఏయూ క్యాంపస్: పరిశోధనలు సమాజ ఉపయుక్తంగా నిలవాల్సిన అవసరం ఉందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ ట్రాన్స్ డిసిప్లీనరీ రీసెర్చ్ హబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రీసెర్చ్ మెథడాలజీ రెండు వారాల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో బ్లెండెడ్ విధానంలో ఈ తరగతులను నిర్వహిస్తున్నారు.